సాక్షి ఒడిశా

శుక్రవారం । 30 । జూన్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,74,138లు వచ్చాయని అధికారులు తెలిపారు.




'దిశ'ను బహిష్కరించిన ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే

- 8లో

సాగర తీరంలో సైకతమూర్తి

భువనేశ్వర్: జగన్నాథుని స్వర్ణాలంకార దర్శనం పురస్కరించుకుని పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో ఈ సైకత శిల్పం ఆవిష్కరించాడు. సందర్శకులు, పర్యాటకులను ఈ శిల్పం విశేషంగా ఆకట్టుకుంది.



న్యూస్‌రీల్

మున్సిపాలిటీ ప్రగతికి కృషి చేయాలి



బ్యాంక్ ప్రారంభోత్సవంలో టికు, అలీ, సిబ్బంది

జయపురం: రైతులకు విరివిగా బ్యాంక్ రుణాలు సమకూర్చాలని కొట్‌పాడ్ మున్సిపల్ కౌన్సిలర్ టికు బిశాయి కోరారు. జయపురం సబ్ డివిజన్ పరిధి కొట్‌పాడ్ మున్సిపాలిటీ బొండాగుడ గ్రామంలో బంధన్ బ్యాంక్ నూతన శాఖను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్‌పాడ్ ప్రజలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని గుర్తుచేశారు. దీనికి అనుగుణంగా ప్రజల ఆర్థిక, సామాజిక ప్రగతికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్థానిక మున్సిపాలిటీలో మరిన్ని బ్యాంకులు అవసరమని, అప్పుడే వాణిజ్య కార్యకలాపాలు సులభతరం అవుతాయని తెలిపారు. కౌన్సిలర్ యూసిఫ్ అలీ మాట్లాడుతూ వ్యాపారులు బ్యాంక్ సేవలు పొందడంతో పాటు కొట్‌పాడ్‌లో వాణిజ్య ప్రగతికి తోడ్పడాలని సూచించారు. బ్యాంక్ మేనేజర్ కిటి గిరి మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు తమ బ్రాంచి సేవలను సద్వినియోగం చేసుకోవాలని, దీనికి అంతా సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహ్మద్ సల్మాన్, మోహణ శెఠి, వికాశ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో జుయల్ ఓరా పర్యటన



ప్రసంగిస్తున్న కేంద్ర మాజీమంత్రి జుయల్ ఓరా

మల్కన్‌గిరి: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర మాజీమంత్రి జుయల్ ఓరా గురువారం పర్యటించారు. ముందుగా మత్తిలి చేరుకున్న ఆయన.. అక్కడి నుంచి పద్మగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యారు. గిరిజనులు సంప్రదాయ నృత్యాలతో ఓరాకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9ఏళ్ల మోదీ పాలనలో కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో ఆరా తీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల సంక్షేమానికి అమలు చేస్తున్న వసతి గృహాలు, ఉచిత బియ్యం తదితర పథకాలపై వివరించారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే ఆదిత్య మాఢి, నవరంగ్‌పూర్ మాజీ ఎంపీ బలభద్ర మాఝి, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల కార్మికుల నియంత్రణపై అవగహన ర్యాలీ



జెండా ఊపి, ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలో బాల కార్మికుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు బాలల సంరక్షణాధికారి నారాయణ్ దాస్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కార్మికశాఖ కార్యాలయం నుంచి చైతన్య ర్యాలీని ఆయన గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన కొందరు కాంట్రాక్టర్లు ఎక్కువ వేతనాలు ఇప్పిస్తామని చెప్పి, చిన్నారులను దూర ప్రాంతాలకు తీసుకు వెళ్తున్నారని తెలిపారు. అలాగే వారితో ప్రమాదాకరమైన పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాల కార్మికుల రక్షణ, పునరవాసంపై గిరిజన ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చైతన్యం రథం గ్రామాల్లో పర్యటించనుందని ప్రకటించారు. ర్యాలీలో జిల్లా సాంఘిక సంక్షేమాధికారి అనూరాధ మహంతి, మున్సిపాలిటీ సభ్యులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నిరసన

జయపురం: దేశంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీ, బీజేడీ ప్రభుత్వాల తీరుకు నిరసనగా ప్రజా పోరాటం సాగించాలని కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సమావేశం తీర్మానించింది. జయపురం కార్మిక భవనంలో గురువారం జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్‌కుమార్ మహంతి అధ్యక్షతన ఈ మేరకు పలు ప్రతిపాదనలు ప్రవేశ పెట్టారు.

పసిడి వెలుగుల్లో.. పురుషోత్తముడు



శ్రీమందిరం సింహద్వారం వాకిలిలో రథాలపై బంగారు దేవుళ్లని దర్శించుకుంటున్న భక్తజనం



శ్రీమందిరం నుంచి రథాల పైకి బంగారు కిరీటాల తరలింపు



బలభద్రుని చిద్విలాసం



బంగారు శోభలో జగన్నాథుడు



బంగారు కిరీటంతో దేవీ సుభద్ర

శ్రీమందిరం సింహద్వారం ఆవరణ భక్తజనంతో కళకళలాడింది. రథాలపై దేవుళ్లు.. బంగారు శోభతో కనులు మిరమిట్లు గొలిపించారు. 3 రథాలపై స్వర్ణాలంకారం సాయంత్రం 5.05 గంటలకు ప్రారంభమై 6 గంటలతో ముగిసింది. మూల విరాట్‌లకు అమూల్యమైన బంగారు ఆభరణాల అలంకరణ పూర్తి కావడంతో దర్శనానికి అనుమతించారు. అగణిత భక్తజనం మనసారా బంగారు సామిని దర్శించుకుంది.

– భువనేశ్వర్

- కనుల పండువగా పూరీ సొనోభెసా మహోత్సవం
- మహా బాహుగా దర్శనమిచ్చిన జగన్నాథుడు
- అర్ధరాత్రి వరకు భక్తులకు అనుమతించిన పాలకవర్గం
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు మధ్య ముగిసిన వేడుక



తాళధ్వజంపై బలభద్ర స్వామి బంగారు ఆభరణాలు



దర్ప దళనంపై అలంకరణ కోసం సిద్ధం చేసిన దేవీ సుభద్ర బంగారు ఆభరణాలు

శ్రీమందిరం రత్న వేదికపై నిత్యం స్వామి అసంపూర్ణ దారుమూర్తిగా దర్శనమిస్తాడు. రథయాత్ర పురస్కరించుకుని ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా సింహద్వారం ఆవరణలో రథంపై బంగారు ఆభరణాలతో శోభితుడై సర్వ జనానికి మురిపిస్తాడు. అనుబంధ అలంకరణతో బంగారు కాలు, చేతులు, కిరీటం తదితర అలంకరనతో సువర్ణ సుందర మూర్తిగా పరిపూర్ణ జగన్నాథుని దర్శనం కనులు చెమర్చుతుంది. ఈ సందర్భంగా స్వామి భక్తుల గోడు ఆలకించేందుకు భక్తజన దర్బారులో పాల్గొంటాడని విశ్వాసం. సర్వ జీవరాశుల మొర ఆలకించి ఆదుకుంటాడని, నలుమూలల నుంచి తండోపతండాలుగా భక్తులు తరలి వస్తారు. కుల, మత, వర్గ, వర్ణ బేధ భావాలకు అతీతంగా సర్వ మానవాళి ఆరుబయట రథంపై స్వామి బంగారు శోభను ప్రత్యక్షంగా తిలకించే అపురూప అవకాశం ఇది. నింగి నుంచి ముక్కోటి దేవతలు రథంపై స్వామిని బంగారు రాజమూర్తిగా దర్శిస్తారని పౌరాణిక ప్రవచకులు చెబుతుంటారు. బంగారు అలంకరణలో స్వామిని రాజాధి రాజా, రాజ రాజేశ్వర అలంకరణగా కొనియాడడం దీనికి తార్కాణం. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే ఆలయం బయట ఈ దర్శనం లభిస్తుంది.

బంగారు ఖజానా..

శ్రీమందిరం అంతర రత్న భాండాగారం నుంచి రథాలపై మూల విరాట్‌ల అలంకారానికి అవసరమైన బంగారు ఆభరణాలను తరలించారు. శ్రీమందిరం సింహద్వారం మీదుగా రథాల పైకి ఆభరణాలు చేరడంతో అలంకరణ ప్రారంభమైంది. స్వామి భాండాగారంలో 150కి పైగా రత్న, వైడూర్య ఖచిత స్వర్ణ ఆభరణాలు ఉన్నాయి. నామమాత్రంగా 20 నుంచి 30 రకాల ఆభరణాలు మాత్రమే ప్రస్తుతం వినియోగిస్తున్నారు. జగన్నాథునికి 610 తులాలు, బలభద్రునికి 434 తులాలు, దేవీ సుభద్రకు 274 తులాల బరువైన బంగారు కిరీటాలు ఖజానాలో భద్రంగా ఉన్నట్లు సమాచారం.

ఏటా 5సార్లు..

ఆలయం లోపల ఏడాదికి 4సార్లు స్వామిని బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. ఇలా ఏటా స్వామి 5సార్లు బంగారు శోభితుడుగా భాసిల్లడం విశేషం. ఏటా పుష్యమాస పూర్ణిమ(జనవరి), ఆషాఢ(బహుడా) ఏకాదశి(జూన్–జులై), విజయ దశమి(అక్టోబర్), కార్తీక పూర్ణిమ(నవంబర్), డోలో పూర్ణిమ(మార్చి) సందర్భాల్లో స్వర్ణాలంకరం జరుగుతుంది. అయితే బహుడా ఏకాదశి పురస్కరించుకుని జరిగే స్వర్ణాలంకారంలో అత్యధిక ఆభరణాలు వినియోగిస్తారు. రథాలపై బంగారు దర్శనం తరహాలో శ్రీమందిరం రత్న వేదికపై సాధ్యం కాదు.

వజ్ర కవచధార..

శంఖ, చక్ర, గదాదులతో జగన్నాథుడు మహాబాహుగా రథంపై భక్తులకు దర్శనమిచ్చాడు. కుడి, ఎడమ చేతుల్లో నాగలి, కంకితో బలభద్ర స్వామి, కిరీట శోభతో దేవీ సుభద్ర చూడ ముచ్చటగా భక్తజన హృదయాలను రంజింప జేయడం విశేషం. స్వర్ణ హస్త, పాయర్(కాలు), మకుటం(భారీ కిరీటం) టీవితో నిలువెత్తు స్వామి మయూర్ చంద్రిక, చూల పట్టి, కర్ణ కుండలాలు, రాహు రేఖతో శ్రీముఖం స్వర్ణశోభితం తన్మయంలో ముంచెత్తింది. పద్మ, సూర్యకాంత, చంద్ర, కదంబ ఇత్యాది బంగారు మాలల తళుకులు కనులు మిరమిట్లు గొలిపించాయి.

త్రినేత్రుడిగా..

స్వామి నుదుట ఆభరణం శ్రీ చిత్తా(బాసికం) మూడో నేత్రంగా భక్తజనం దృష్టిని ఆకట్టుకుంటుంది. ఇది నిత్య శోభితం. ఈ ఆభరణం వజ్ర ఖచితం కావడం విశేషం. స్నానోత్సవం పురస్కరించుకుని బయటకు తరలివచ్చే సమయం మినహా ఇతర సమయాల్లో శ్రీచిత్తా స్వామి నుదుట నిత్యం అలంకరించబడి ఉంటుంది.

సులభ దర్శనానికి ఏర్పాట్లు..

జగన్నాథ ఆలయ సింహద్వారం వాకిలిలో రథాలపై బంగారు అలంకారంలో మూల విరాటులను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం బహుడా యాత్ర సందర్భంగా గుండిచా ఆలయం నుంచి రథాలను సింహద్వారం ముందు నిలిపిన విషయం తెలిసిందే. రథాలపై మధ్యాహ్న ధూపం, మైలం, సంధ్యాహారతి తదితర కార్యక్రమాల అనంతరం ఆలయ రత్న భాండారం(ఖజానా) నుంచి భారీ బందోబస్తు మధ్య సేవకులు భారీ బంగారు ఆభరణాలను తీసుకొచ్చారు. మరోవైపు సంస్కరణ చర్యల్లో భాగంగా రథాలపై బంగారు దేవతల దర్శనం రాత్రి 10 గంటల వరకు పరిమితం చేసినట్లు ఆలయ పాలకవర్గం తొలుత ప్రకటించింది. అయితే తండోపతండాలుగా తరలి వచ్చిన భక్తజనానికి సంతృప్తికర దర్శనం కల్పించే దిశలో పాలకవర్గం యథాతథంగా అర్ధరాత్రి 12 గంటల వరకు రథాలపై దేవుళ్లను దర్శించుకునేందుకు అనుమతించారు.



మూల విరాట్‌ల బంగారు పాదం, హస్తం, కిరీటాలు



జగన్నాథుని అలంకరణకు తరలిస్తున్న బంగారు చక్రం

నిరంతర నిఘా..

స్వర్ణాలంకార సేవలు తదనంతర దర్శనం సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ జారీ చేసినట్లు అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఏడీజీ)అమితాబ్ ఠాకూర్ తెలిపారు. స్థానిక ఒఠొరొ(18) నాలా ఛక్ నుంచి హాస్పిటల్ కూడలి వరకు, అక్కడి నుంచి సుభాష్‌చంద్ర బోస్ క్రాసింగ్ వరకు రథాలపై తోబుట్టువుల దేవతలతో జగన్నాథుని బంగారు అలంకరణ దర్శనం సాఫీగా కొనసాగించేందుకు వాహన రవాణా రహిత జోన్ గా ప్రకటించారు. ట్రాఫిక్, పార్కింగ్ నిర్వహణ కోసం డ్రోన్‌లను మోహరించారు. వృద్ధులు, దివ్యాంగులకు సులభ దర్శనం కల్పించేందుకు బ్యాటరీతో నడిచే వాహనాలు అందుబాటులో ఉంచినట్లు ఆయన వివరించారు.

పరిమిత సంఖ్యలో..

రథాలపై మూల విరాట్‌లకు బంగారు ఆభరణాల అలంకరణ కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించారు. జిల్లా పోలీసు యంత్రాంగంతో ఆలయ పోలీసు సిబ్బంది ఈ చర్యల్లో పాలుపంచుకున్నారు. మూల విరాట్‌ల అలంకరణ కోసం పరిమిత సేవాయత్ ప్రతినిధులను అనుమతించారు.

కేంద్రం పథకాలకు రాష్ట్రంలో తిలోదకాలు




సమావేశంలో కేంద్రమంత్రి దర్శనా జర్దోష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిభుతి జెనా, కన్నుపతి

- బీజేడీ ప్రభుత్వంపై రైల్వేశాఖ సహాయమంత్రి దర్శనా జర్దోష్ విమర్శలు

బరంపురం: స్థానిక జిల్లాలో 80శాతం మంది ప్రజలు వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా బతుకుతున్నారని, అయితే వారి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెటిన వివిధ పథకాలను రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వం అమలు చేయడం లేదని కేంద్ర రైల్వే, కర్మాగారాల శాఖ సహాయమంత్రి దర్శనా జర్దోష్ విమర్శించారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బీజేపీ జిల్లా స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ నిర్లక్ష్యంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో రైతుల ఆత్మహత్యలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ప్రకృతి వైపరిత్యాలతో గత ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోయిన రైతుల రుణాలు మాఫీ చేయక పోవడమే దీనికి కారణమన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు ఇప్పటి వరకు నష్ట పరిహారాన్ని చెల్లించక పోవడంతో వారంతా రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిభుతి జెనా మాట్లాడుతూ బీజేడీ ఉదాసీన వైఖరితో రానున్న రోజుల్లో వ్యవసాయ రంగమే ఏకనుమరుగయ్యే భయానక పరిస్థితి నెలకొంటుదన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు కన్ను చరణ్‌పతి మాట్లాడుతూ మండీల ద్వారా ధాన్యం కొనుగోళ్లలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని, రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని వాపోయారు. సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

'బహుడా' మృతులకు పరిహారం



కొలాబ్‌నగర్‌లో ప్రమాద స్థలం(ఫైల్)

భువనేశ్వర్: కెంజొహర్ జిల్లా కెందువా గ్రామంలోని ముగ్గురు వ్యక్తులు, కొరాపుట్ జిల్లా కొలాబ్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు బహుడా యాత్రలో జరిగిన ప్రమాదాల్లో మృతిచెందారు. బుధవారం ఈ విషాద ఘటనలు చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం పరిహారం ప్రకటించారు. సీఎం సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) నుంచి ఈ నిధులు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. మృతుల పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి ఉచితంగా వైద్యం అందించాలని అధికార యంత్రాంగానికి ఆదేశించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.


మనోభావాలు, పరివర్తనను గుర్తించాలి



న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్న మానిటరింగ్ కమిటీ సభ్యులు

- ధ్యాన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన జస్టిస్ సంజీవకుమార్
- హాజరైన 5జిల్లాలకు చెందిన న్యాయవాదులు

జయపురం: కక్షిదారులు, వారి వివాదాల పరిష్కారంలో న్యాయవాదులు కీలక భూమికపై పోషిస్తారని ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ సంజీవ కుమార్ పాణిగ్రాహి తెలిపారు. అదే సమయంలో బాధితుల మనోభావాలు, నిందితులు పరివర్తనను కూడా గుర్తించాలని సూచించారు. కొరాపుట్ జిల్లా కోర్టు జయపురంలో ఏర్పాటు చేసిన ధ్యాన శిక్షణ ప్రత్యేక శిబిరాన్ని ఆయన బుధవారం సాయంత్రం ప్రారంభించారు. జూలై 2వరకు 40 గంటలు కొనసాగనున్న ఈ శిక్షణలో మానటరింగ్ కమిటీ సభ్యులు జస్టిస్ సావిత్రి రథ్, జస్టిస్ మృగాంక శేఖరసాహు కొరాపుట్, నవరంగపూర్, మల్కన్‌గిరి, రాయగడ, కలహండి జిల్లాలకు చెందిన సీనియర్, జూనియర్ న్యాయవాదులు హాజరయ్యారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యనారాయణ మిశ్రా, న్యాయసేవా ప్రాధీకరణ కార్యదర్శి సుమన్ జెనా, ఒడిశా న్యాయసేవా అదనపు కార్యదర్శి సృజన్ సరస్వత్, శిక్షకులు గిరిబాల సింగ్, ఎంకే యాదవ్, కేంద్రం కో–ఆర్డినేటర్ సొమ్యక్ పాత్రొ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భబురేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ధ్యాన ప్రాధాన్యతను వివరిస్తున్న జస్టిస్ సంజీవకుమార్ పాణిగ్రాహి

క్లుప్తంగా

293కి పెరిగినన బహనాగా మృతులు

● ఎస్సీబీలో మరో బాధితుడి మృతి

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వేస్టేషన్‌లో ఈనెల 2న జరిగిన ట్రిపుల్ రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 293కి చేరుకుంది. కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు గురువారం తుదిశ్వాస విడిచాడు. దీంతో మృతుల సంఖ్య పెరిగి 293కి చేరింది. మృతుడు బీహార్ రాష్ట్రంలోని జముయికి చెందిన మనీష్ కుమార్(24)గా గుర్తించారు. ఎస్సీబీ ఆస్పత్రి సెంట్రల్ ఐసీయూలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికత్స కోసం దుర్ఘటన సంభవించిన మర్నాడు ఈ ఆస్పత్రిలో చేర్చారు. షాలిమార్ నుంచి చెన్నైకి వెళ్లే కోరమండల్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైలు దుర్ఘటనలో గతంలో 288మంది మృతి చెందినట్లు అధికార వర్గాలు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు క్రమంగా మరణిస్తుండడంతో ఈ సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో ఇటీవల కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఐదుగురు మృతిచెందారు. మరో 22మంది చికిత్స పొందుతున్న వారిలో ఉన్నారు. వీరిలో ఐదుగురు ఐసీయూలో, మిగతా వారు వివిధ వార్డుల్లో వైద్యం పొందుతున్నారు.

చిన్ని ప్రాణానికి ఆపద



కోటబొమ్మాళి: తల్లి పొత్తిళ్లలో హాయిగా ఆడుకోవాల్సిన పసివాడు ప్రాణాల కోసం పోరాడుతున్నాడు. మల విసర్జన జరగక, కడుపు పొంగిపోయి నరకయాతన అనుభవిస్తున్నాడు. ఏడాదిన్నర వయసుకే క్యాన్సర్ సోకడంతో బాధ తాళ లేకపోతున్నాడు. పిల్లాడి పరిస్థితి చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. ఆపరేషన్ చేయించే స్థోమత లేకపోవడంతో దాతల సాయం కోరుతున్నారు. తమ బిడ్డ ఆయుష్షు పెరగాలంటే మనసున్న వారు ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

కోటబొమ్మాళి మండలం తర్లిపేట పంచాయతీ చలమయ్యపేట కాలనీకి చెందిన జుత్తు సూర్యనారాయణ, అంజలి దంపతులకు నలుగురు సంతానం. మొదటి ఇద్దరు కూతుళ్లు కాగా తర్వాత మగపిల్లలు పుట్టారు. అందులో చివరి వాడు దేవాన్ష. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో దేవాన్షుకు ఒంట్లో నలతగా ఉండడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పిల్లాడిని పరీక్షించిన వైద్యులు ఆ బాలుడికి జీర్ణాశయ క్యాన్సర్ సోకిందని చెప్పడంతో తల్లిదండ్రుల గుండెల్లో రాయి పడింది. అప్పటి నుంచి శ్రీకాకుళం, విశాఖల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు తిరుగుతూనే ఉన్నారు. ఇంతలోనే 15 రోజుల కింద పిల్లాడికి మల విసర్జన మందగించింది. దీంతో కడుపు ఉబ్బిపోయింది. అప్పటి నుంచి పసివాడు ఊపిరాడక విలవిలలాడిపోతున్నాడు. వారం రోజుల కిందట విశాఖలోకి కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. కేన్సర్ కారణంగా జీర్ణాశయం అభివృద్ధి చెందడం లేదని, వెంటనే అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని చెప్పారు. అందుకు రూ.30 లక్షలు ఖర్చవుతాయని చెప్పడంతో ఆ డబ్బు ఎలా తీసుకురావాలో తెలీక తల్లిదండ్రులు మదనపడుతున్నారు. మంత్రి సీదిరి అప్పలరాజుకు విషయం చెప్పడంతో.. సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయాలని, తాను సిఫార్సు చేస్తానని తెలిపారు. అయితే ఓ వైపు పిల్లాడి వైద్యం, మరోవైపు కుటుంబ పోషణ వీరికి కష్టమైపోతోంది. ప్రస్తుతం దేవాన్ష ఆరోగ్యం విషమంగా ఉంది. దాతలు తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని కోరుతున్నారు. సాయం చేయదలచుకున్న వారు 97003 82362 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గంజాయి ముఠా అరెస్ట్



ఆమదాలవలస: భువనేశ్వర్ నుంచి కేరళకు గంజాయిని తరలిస్తున్న ముఠా సభ్యులను బుధవారం అరెస్టు చేసి గురువారం కోర్టుకు తరలించామని ఆమదాలవలస సీఐ పైడయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గంజాయి ముఠా సభ్యులు ఆమదాలవలసలో ఓ లాడ్జిలో ఉన్నారని, ఇక్కడ వేరే రైలు ఎక్కేందుకు వేచి చూస్తున్నారని ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణకు సమాచారం అందింది. దీంతో సాయంత్రం 5 గంటల సమయంలో దాడులు చేశారు ఈ దాడిలో వన్‌వే జంక్షన్ వద్ద ఈ ముఠాలో ముగ్గురు సభ్యులను పట్టుకుని వారి వద్ద ఉన్న సుమారు 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేరళ రాష్ట్రం, మలాపురం జిల్లాకు చెందిన మహమ్మద్ సాహల్, మసూద్ కరన్ చెరి, అఫ్సాల్ పలక్కల్ అనే ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరు భువనేశ్వర్‌లో గంజాయి కొనుగోలు చేసి కేరళ రాష్ట్రంలో విక్రయించేందుకు వెళ్తున్నారని సీఐ చెప్పారు. ఈ గంజాయి విలువ రూ. 75 వేలు ఉంటుందని తెలిపారు. వీరితో పాటు మరో ముగ్గురు కూడా ఉన్నారని, వారు తప్పించుకుని పారిపోయారని, వారిని కూడా పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని సీఐ తెలిపారు.

నిర్లక్ష్యం ఖరీదు.. రెండు ప్రాణాలు

● వంతెన నిర్మాణాల వద్ద బోర్డు ఏర్పాటు చేయని సిబ్బంది

● మినీ వ్యాన్ బోల్తాపడి ఇద్దరి మృతి



ఘటనా స్థలంలో బోల్తాపడి ఉన్న వ్యాన్

కొరాపుట్: నూతన వంతెన నిర్మిస్తూ పక్క రహదారి(డైవర్సన్) బోర్డు లేకపోవడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నవరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి కొంటాగాం గ్రామానికి చెందిన 16మంది గిరిజన మహిళలు పనస పళ్లు సేకరించి, వాటిని విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మినీ వ్యాన్‌ను అద్దెకు తీసుకొని, పక్కనే ఉన్న కలహండి జిల్లా జయపట్న సమితి ధన్సులి గ్రామంలో జరిగే వారపు సంతకు బయలుదేరారు. మార్గంమధ్యలోని ఘాట్ వద్ద వంతెన నిర్మాణం జరుగుతుండగా.. పక్కనే ప్రత్యమ్నాయంగా మరోదారి ఏర్పాటు చేశారు. అయితే దీనిని సూచిస్తూ ఎటువంటి బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో గమనించని డ్రైవర్.. నేరుగా వంతెన వైపు వాహనాన్ని మళ్లించాడు. దీంతో వంతెనపై నుంచి బోల్తా పడింది. ఘటనలో నవరంగ్‌పూర్ జిల్లా కృష్ణగుడ గ్రామానికి చెందిన డ్రైవర్ జయసింగ్ గౌడ(35), టిమన్‌పూర్‌కు చెందిన మహిళ ముక్తా పుజారీ(40) అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా వారు గాయపడగా జయపట్న ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. నవరంగ్‌పూర్ బీజేపీ నాయకుడు గౌరీశంకర్ మాఝి ఆస్పత్రికి చేరుకొని.. బాధితులకు సాయం అందజేశారు. వంతెన పనులు చేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ విధంగా జరిగిందని బాధితులు ఆరోపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు.



జయపట్న ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న గౌరీశంకర్ మాఝి




క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



మురుగు ప్రాంతాల్లో చేప పిల్లలు వదులుతున్న అధికారులు

రాయగడ: వర్షాల సీజన్‌లో అధికంగా వ్యాపించే మలేరియా, డెంగీ వంటి వ్యాధుల కట్టడికి మున్సిపాలిటీ, జిల్లా ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మురుగునీరు నిల్వ ఉండే ప్రాంతాలను ముందుగా గుర్తించారు. ఇటువంటి ప్రాంతాల్లో దోమలు అత్యధికంగా స్థావరాలు ఏర్పరుచుకొని, సంతానాన్ని పెంపొందించే అవకాశం ఉండటంతో వాటి నియంత్రణకు విస్తృత చర్యలు చేపట్టారు. మురుగు నిల్వ ఉండే ప్రదేశాల్లో గంబూసియా రకం చేపల పిల్లలను విడుదల చేశారు. ఈ చేపలు దోమల గుడ్లు, వాటి పిల్లలను నిర్మూలించడంతో వాటి వ్యాప్తి తగ్గుముఖం పడుతుంది. పట్టణంలోని రైతుల కాలనీ, శాస్త్రినగర్ తదితర ప్రాంతాల్లో 50నుంచి 60వరకు చేప పిల్లలను విడిచి పెట్టామని ఏడీఎం బి.లక్ష్మీనారాయణ పృష్టి తెలిపారు. భువనేశ్వర్ నుంచి వీటిని ప్రత్యేకంగా తీసుకు వచ్చినట్లు మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్ వివరించారు.



గంబూసియా రకం చేపపిల్లలు

రాజధానిలో కాల్పుల కలకలం

● బీజేడీ కార్పొరేటర్ సోదరుడు, మేనల్లుడిపై దుండగుల కాల్పులు

● ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

భువనేశ్వర్: స్థానిక నగరంలోని లక్ష్మీసాగర్ పోలీస్ స్టేషన్‌కు కొన్ని మీటర్ల దూరంలో బుధవారం రాత్రి జరిగిన కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వీరివురూ భువనేశ్వర్ నగరపాలక సంస్థ 32వ నంబర్ వార్డ్ బీజేడీ కార్పొరేటర్ శ్రీధర్ జెనా సోదరుడు సిఖర్ జెనా, అతని మేనల్లుడు అలోక్‌కుమార్ జెనాగా గుర్తించారు. క్షతగాత్రులు క్యాపిటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజకీయ కక్షలు ఈ విచారకర ఘటనకు కారణంగా భావిస్తున్నారు. కార్పొరేటర్ శ్రీధర్ పెద్ద మేనల్లుడు ఇంటికి తిరిగి వస్తుండగా.. కొందరు వ్యక్తులు అతని వాహనానికి అడ్డంగా తమ కారును నిలిపి, దాడికి పాల్పడ్డారు. మేనల్లుడు అలోక్‌కుమార్‌పై కాల్పులు జరిపారు. విషయం తెలియడంతో ఘటనా స్థలానికి చేరిన కార్పొరేటర్ అన్న, చిన్న మేనల్లుడుని దుర్భాషలాడి కించపరిచారు. ఇంతలో నిందితుల్లో ఒకరు పిస్టల్ తీసి గాల్లోకి కాల్పులు జరిపినట్లు సమాచారం. నిందితుడి నుంచి పోలీసులు పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నప్పుడు, అతను మరొక పిస్టల్‌ను బయటకు తీసి, జెనా అన్నయ్య, మేనల్లుడిపై కాల్పులు జరిపాడు. ఘటనపై డీసీపీ ప్రతీక్ సింగ్ గురువారం మీడియాతో మాట్లాడారు. నిందితుల నుంచి రెండు పిస్టోల్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటిలో ఒకటి లైసెన్స్ పొందినది, మరొకటి నాటు పిస్తోల్‌గా ప్రకటించారు. పేలని తూటాలు 9 జప్తు చేశామన్నారు. కేసులో ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్ట్ చేయగా, ఘటనకు సంబంధించి లక్ష్మీసాగర్ పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. మిగతా నిందితులను గుర్తించామని, వారిని త్వరలోనే పట్టుకుంటామని డీసీపీ వివరించారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: శ్రీ ఉషా పద్మిని ఛాయాదేవి అమ్మవార్లతో సూర్యనారాయణ స్వామి వారి కల్యా ణోత్సవం గురువారం ఉదయం స్థానిక అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. ఆషాడ శుద్ధ (శయన ఏకాదశి) ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణ ప్రక్రియను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. అనివెట్టి మండ పంలో వేంచేంపజేసిన కల్యాణమూర్తుల కల్యా ణ సేవలో పలువురు భక్తులు రూ.500 చెల్లించి పాల్గొన్నారు. వీరికి స్వామి శేషవస్త్రాలతో పాటు కల్యాణ తలంబ్రాలను అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

'దిశ'ను బహిష్కరించిన ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే



నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే నిత్యానందను వారిస్తున్న ఎంపీ రమేష్



హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు

● నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ మాఝి బుజ్జగింపులు విఫలం

కొరాపుట్: దిశ(జిల్లా డెవలప్‌మెంట్ కో–ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) సమావేశం రాజకీయ విబేధాలకు వేదికగా మారింది. నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మిషన్‌శక్తి సమావేశ మందిరంలో నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి అధ్యక్షతన దిశ సమావేశం గురువారం జరిగింది. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సభ్యుల ప్రశ్నలకు అధికారుల సమాధానాలకు కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా వారధిగా ఉండి సమన్వయం చేస్తున్నారు. ఇదే సమయంలో అధికార పార్టీ బీజేడీకి చెందిన డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి మాట్లాడుతూ డాబుగాం ప్రాంతంలో 5టీ బోర్డు తొలగింపు పట్ల నిరసన వ్యక్తం చేశారు. దీనికి అడ్డు తగులుతూ బీజేపీకి చెందిన ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గొండో వాదనకు దిగారు. కేంద్రం పథకాలను రాష్ట్రం తమవిగా ప్రచారం చేసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోవిడ్ టీకాల పంపిణీ కేంద్రాల వద్ద ప్రధాని నరేంద్రమోదీ ఫొటో లేదని ఎద్దేవా చేశారు.

5టీ కార్యదర్శిపై విమర్శనాస్త్రాలు..

దీనిపై బీజేడీకి చెందిన ఎంపీ రమేష్ మాఝి స్పందిస్తూ.. కోవిడ్ మరణ ధ్రువ పత్రాలపై మోదీ ఫొటో వేస్తే సహిస్తారా అంటూ ప్రశ్నించారు. కోవిడ్ టీకాకు ఉన్న నిబంధన ధ్రువపత్రానికి వర్తించదా అని ఆక్షేపించారు. దీంతో ఎమ్మెల్యే నిత్యానంద ఆగ్రహం వ్యక్తం చేస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 5టీ పాలన జరుగుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని దుయ్యబట్టారు. ప్రజల నుంచి ఎంపికైన ప్రజా ప్రతినిధుల కంటే 5టీ కార్యదర్శికే ఎక్కువ అధికారాలు ఉన్నాయన్నారు. ఇటీవల విజిలెన్స్‌కి పట్టుబడిన నవరంగ్‌పూర్ సబ్ కలెక్టర్ ప్రశాంత్‌తో 5టీ సెక్రటరీకి అనుబంధం ఉందని ఆరోపించారు. ఇటువంటి సమావేశాలు తమను అవమానించడానికే అంటూ నినాదాలు చేస్తూ బయటకు నడిచారు. వెంటనే అప్రమత్తమైన ఎంపీ.. తన సీటు నుంచి లేచి ఎమ్మెల్యేను బుజ్జగించే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో ఎన్నో ఉంటాయని, సమావేశం నుంచి వెళ్లవద్దని సూచించారు. తలుపు వేయకుండా అడ్డుపడ్డారు. అయితే నిత్యానంద సమావేశం నుంచి బహిష్కరించి వెళ్లిపోయారు. అనంతర సభ యథాతథంగా కొనసాగించారు. సమావేశంలో నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్‌చంద్ర మాఝి, జెడ్పీ అధ్యక్షుడు మోతీరాం నాయక్, రాష్ట్ర లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ ప్రమోద్ పాఢి, డీఆర్‌డీఏ పీడీ అన్య దాస్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సుందరం.. స్వర్ణ శోభితం

● సానోభెసో అలంకరణలో దేవతామూర్తులు

● పెద్ద సంఖ్యలో దర్శించుకున్న భక్తజనం

రథాయాత్రలో భాగంగా గుండిచా మందిరం నుంచి జగన్నాథ సన్నిధికి చేరుకున్న జగన్నాథ, బలభద్ర, సుభద్రా మూర్తులు గురువారం సునాబెసోలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో చేరుకున్న భక్తజనం.. బంగారు అలంకరణలో ఉన్న సువర్ణమూర్తుల దర్శనంతో తన్మయం పొందారు. తొలి ఏకాదశి కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సేవాసంస్థలు భక్తులకు పులిహోరా, ప్రసాదాలు పంపిణీ చేశారు. జయపురంలో సంప్రదాయం ప్రకారం ఒకరోజు ఆలస్యంగా గురువారం బహుడా యాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి స్వయంగా రథం లాగి, అందరినీ ఉత్సాహ పరిచారు.

– సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: సువర్ణాలంకరణలో సుభద్రాదేవి



పర్లాకిమిడి: బంగారు రూపంలో జగన్నాథుడు



పర్లాకిమిడి: సానోభెసోలో బలరాముడు



జయపురం: భవనాల పైనుంచి రథాయాత్ర తిలకిస్తున్న దృశ్యం



రాయగడ: సునాబెసోలో దేవతామూర్తులు



కొరాపుట్: బంగారు ఆభరణాలతో దేవదేవుళ్లు



కొరాపుట్: నవరంగ్‌పూర్‌లో ప్రసాదం పంపిణీలో జ్యోతిర్మయి మహిళలు



జయపురం: రథం వద్ద దేవతలకు పూజలు చేసేందుకు పోటెత్తిన భక్తులు



జయపురం: డాలు వాయిస్తూ ప్రజలను ఉత్సాహ పరుస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్



రాయగడ: ప్రసాదం పంపిణీ చేస్తున్న సేవాసంస్థల ప్రతినిధులు

క్లుప్తంగా

జూలై 4న మినీ జాబ్‌మేళా


మాట్లాడుతున్న సాయికుమార్

పార్వతీపురంటౌన్: నిరుద్యోగులు ఉద్యోగాలు పొందేందుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ పార్వతీపురం మన్యం జిల్లా అధికారి వి.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో హితవు పలికారు. ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ అండ్ ట్రైనింగ్ ఆఫీసర్, ముథూట్ ఫైనాన్స్‌లో ఇంటర్న్ పీఓగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. 18నుంచి 27 ఏళ్ల లోపు ఉన్న ఎంసీఏ, బీటెక్, బీఈడీ, బీఎస్సీ, ఎంఎస్సీ కంప్యూటర్స్, ఎంసీఏ, బీసీఎస్ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులు జూలై 4న పార్వతీపురం పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న మినీ జాబ్‌మేళాకు హాజరుకాగలరని సూచించారు. ఈ మేళాకు సైట్ స్పెక్ట్రమ్ టెక్నాలజీస్, ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్, ముథూట్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు హాజరవుతారని, ఆసక్తి గల యువత డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9182398325,7997299739 నంబర్లను సంప్రదించాలని స్పష్టం చేశారు.

గురజాడ దంపతులకు సత్కారం


గురజాడ దంపతులను సత్కరిస్తున్న సమరసత వేదిక ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రా సమరసతా వేదిక ప్రతినిధులు విజయనగరంలోని గురజాడ స్వగృహంలో ఆయన కుటుంబసభ్యులు గురజాడ దంపతులను గురువారం ఘనంగా సత్కరించారు. మహాకవి గురజాడ వాడిన వస్తువులను ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం వాటిని సంరక్షిస్తున్న గురజాడ వెంకటేశ్వర ప్రసాద్, ఇందిర దంపతులను దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ బొంతుకోటయ్య, కుసుమంచి సుబ్బారావు, హెచ్‌కేష్, నరసింగనాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం


ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

వేపాడ: దేవరాపల్లి -ఆనందపురం రహదారిలో వేపాడ మండలంలోని సంజీవమెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. దేవరాపల్లి మండలం ముషిడిపల్లి గ్రామ శివారు రావాడపాలెం గ్రామానికి చెందిన రావాడ లక్ష్మణరావు (22) వేపాడ మండలం సంజీవ మెట్టలోని బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా దేవరాపల్లినుంచి ఆనందపురం వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు తల, కాళ్లుచేతులకు బలమైన గాయాలవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు 108లో దేవరాపల్లి ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి తండ్రి సూరిబాబు ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు యువఉత్సవ్-2023

విజయనగరం: యువతలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ నెల 30న యువఉత్సవ్-2023 పేరిట నిర్వహించే జిల్లా స్థాయి యువజనోత్సవాలను విజయవంతం చేయాలని జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువజనోత్సవాల వాల్‌పోస్టర్‌ను జెడ్పీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సృజనకు పదునుపెట్టేందుకు యువజనోత్సవాలు చక్కటి వేదికగా నిలుస్తాయన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచే యువత, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటిచెప్పాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ఉజ్వల్ మాట్లాడుతూ నగరంలోని ఎంఆర్ కళాశాల సెమినార్ హాల్‌లో శనివారం ఉదయం 10 గంటల నుంచి యువజనోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. భారతదేశం-2047 అనే థీమ్‌తో సృజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక /జానపద కళలు వంటి అంశాలపై యువ ఉత్సవ్ నిర్వహిస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు నెహ్రూ యువకేంద్ర కార్యాలయం సెల్:70374 85273 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, వేపాడ ఎంపీపీ సతీష్, నెహ్రూ యువకేంద్రం ఏఓ వి.పృథ్వి పాల్గొన్నారు.

నాగావళిలో పెరిగిన నీటి ప్రవాహం

సంతకవిటి: నాగావళి నదిలో నీటిప్రవాహం గురువారం స్వల్పంగా పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు తోటపల్లి వద్ద గేట్లు ఎత్తి నీటిని కిందకు విడిచిపెట్టడంతో నదిలో ప్రవాహం పెరిగింది. కుడి ప్రధాన కాలువ ద్వారా పంట పొలాలకు సాగునీరు సరఫరా అవుతుండడంతో రైతులు సంతోషపడుతున్నారు.

సర్వమతాల సమ్మేళనమే దేశం గొప్పతనం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు
- బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ముస్లిం యువత


బక్రీద్‌ను పురస్కరించుకుని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావును సత్కరిస్తున్న మైనార్టీ నాయకులు, యువత


ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న ఈద్గాలో ప్రత్యేక నమాజ్‌లు చేస్తున్న ముస్లిం సోదరులు

విజయనగరం: సర్వమతాల సమ్మేళనమే భారతదేశ గొప్పతనమని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని విజయనగరం మైనారిటీస్ యువత జెడ్పీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం, దుశ్శాలువతో ఆయనను సత్కరించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మైనార్టీ వర్గాల వారు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మైనారిటీస్ నాయకులు జాకీర్ హుస్సేన్, యువత ఖాద్రి, ఇమ్రాన్, ఆబిద్, ఆసిఫ్, సైఫ్ బాబా, ఇంతియాజ్, సమ్దాని, ఇర్ఫాన్, షాదాబ్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

విజయనగరం టౌన్: ముస్లిం సోదరుల పవిత్రదినం బక్రీద్ పండగను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు దైవగ్రంథాన్ని మతపెద్దలు చదివి వినిపించారు. పట్టణంలోని జామియా మసీదు, చోటీ, హుస్సేనీ తదితర మసీద్‌లతో పాటు ఈద్గాల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని నమాజ్ సందర్భంగా ఆకాంక్షించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

రెండోరోజు కొనసాగిన చెస్ పోటీలు

- నేడు విజేతలకు బహుమతి ప్రదానం


రాష్ట్ర స్థాయి చెస్‌పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన అండర్-7 బాల, బాలికల రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు రెండోరోజు గురువారం హోరాహోరీగా కొనసాగాయి. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 85 మంది క్రీడాకారులు హాజరుకాగా 7 రౌండ్‌లలో వారికి పోటీలు నిర్వహిస్తున్నారు. రెండవ రోజు సాయంత్రానికి 5 రౌండ్‌లు ముగిశాయి. శుక్రవారం మిగిలిన రౌండ్‌లు పూర్తి చేసిన అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీఏ రావు, కేవీ జ్వాలాముఖిలు తెలిపారు. పోటీలను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు తదితరులు పర్యవేక్షించారు.

కేజీబీవీల్లో పోస్టులకు స్కిల్ టెస్టులు


అభ్యర్థులకు స్కిల్‌టెస్ట్ నిర్వహణలో పాల్గొన్న డీఈఓ లింగేశ్వర రెడ్డి తదితర అధికారులు

జామి: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రెండవరోజు గురువారం జామి మండలం కుమరాం కేజీబీవీలో స్కిల్ టెస్ట్ నిర్వహించారు. డీఈఓ లింగేశ్వరరెడ్డి, డైట్ ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు, డైట్ లెక్చరర్స్ అభ్యర్థులకు స్కిల్ టెస్ట్ జరిగింది. ఈ మేరకు పీజీటీస్‌లు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్, కామర్స్, సివిక్స్ పోస్టులకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారిలో 99శాతం మంది హాజరయ్యారు. కార్యక్రమంలో డీసీఓ మాలతి, కుమరాం కేజీబీవీ ప్రత్యేకాధికారిణి బి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు

- జూలై 1న బాధ్యతల స్వీకరణ


ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ విశ్వ విద్యాలయం చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన టెక్కలిలోని సెంచూరియన్ వర్సిటీ వీసీగా పనిచేస్తున్నారు. సెర్చ్ కమిటీ ప్రతిపాదనల మేరకు సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆయనను చాన్స్‌లర్‌గా నియమించింది. జూలై 1న బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, వీసీగా పనిచేశారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జ్ వీసీగా, టైమ్స్ ఆఫ్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేశారు. ప్రస్తుతం స్వచ్ఛ విశాఖ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు. జీఎస్ఎన్ రాజు ఖరగ్‌పూర్ ఐఐటీలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి టాపర్‌గా నిలిచారు. ఇప్పటివరకు 55 మంది విద్యార్థులకు పీహెచ్‌డీకి దిశానిర్దేశం చేశారు. 535 పరిశోధన పత్రాలు ప్రచురించడంతో పాటు ఈసీఈలో 5 పాఠ్యపుస్తకాలు రాశారు. విద్యారంగానికి ఆయన చేస్తున్న కృషి కారణంగా రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి గౌరవ కల్నల్ బిరుదు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, కోల్‌కత్తా గవర్నర్లు, ముఖ్యమంత్రుల చేతుల మీదుగా మాత్రమే కాకుండా పలు అంతర్జాతీయ సంస్థల నుంచి అవార్డులను అందుకున్నారు. 50కి పైగా అంతర్జాతీయ సదస్సులకు హాజరయ్యారు. ఆయన కృషిని గుర్తించిన సెంచూరియన్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్‌గా నియమించడంతో విద్యావేత్తలు, అధ్యాపకులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై బాధ్యత మరింత పెరిగిందని విద్యారంగం అభివృద్ధికి, సమాజానికి బాధ్యత గల పౌరులను అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని చెప్పారు.

రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని మృతదేహం


బొండపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని బొండపల్లి గ్రామం సమీపంలో గల రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. ఈ సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. విజయనగరం రైల్వే ఎస్సై రవివర్మ, కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు అందిన సమాచారం మేరకు వచ్చి పరిశీలించామని చెప్పారు. మృతుని శరీరంపై ఎర్రని రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కాతో పాటు, నలుపు రంగు ఫ్యాంటు ధరించి 40 సంవత్సరాలు వయస్సు ఉండవచ్చని గుర్తించామని రైల్వే ట్రాక్ పక్కన రైలు నుంచి జారి పడి గాయాలపాలై మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. అంతకు మించి మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9666555214,9490617089 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పిడుగు పడి మహిళ మృతి


చీపురుపల్లి రూరల్: సీతమ్మ మృతదేహం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో పిడుగుపడి పతివాడ సీతమ్మ (50) మరణించింది. సీతమ్మ గురువారం మధ్యాహ్నం తనకున్న ఆవులను తీసుకుని మేపేందుకు పొలాల వైపు వెళ్లింది. ఆ సమయంలో వర్షంతోపాటు పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సర్పంచ్ బూడి శ్రీరాములు నాయుడు, వీఆర్‌ఓ రాజారావు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు నమోదు సుకున్నారు.


కొమరాడ: జింకకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశు వైద్య అధికారి చక్రధర్, అటవీశాఖ రేంజర్ త్రినాథ రావు

ప్రమాదశాత్తు జింక..

కొమరాడ: మండల కేంద్రం కొమరాడ సమీపంలో ఉన్న అల్ఫా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన భూమిలో ప్రమాదశాత్తు ఆడజింక మృతి చెందినట్లు పార్వతీపురం అటవీశాఖ రేంజర్ పి.త్రినాథవు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కొమరాడ సమీపంలో ఉన్నా పొలాల్లో నీరు కోసం మచ్చల ఆడ జింక వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మృతి చెందిన జింక చూలుతో ఉండడంతో కడుపులో ఆడపిల్ల ఉందన్నారు. పార్వతీపురం నుంచి పశువైద్యాధికారి డాక్టర్ చక్రధర్ వచ్చి పోస్టుమార్టం చేశారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదికను బట్టి వెల్లడిస్తామని చెప్పారు.

రామతీర్థంలో వైభవంగా తొలి ఏకాదశి


యాగశాలలో హోమం జరిపిస్తున్న అర్చకులు


వెండి మంటపం వద్ద సీతారామస్వామికి ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: ఉత్తరాంధ్రలో అతి పెద్ద పుణ్య క్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి పూజలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. అర్చకులు ముందుగా స్వామి వారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుదర్శన కవచం, సుదర్శన అష్టకం, హవనం జరిపించారు. అనంతరం ఆస్థాన వెండి మంటపం వద్ద ఆర్జిత సేవలో భాగంగా సీతారామచంద్రస్వామి నిత్య కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.

చాతుర్మాస దీక్ష(యోగ నిద్ర)లో రాములోరు

ఆషాడ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని రాత్రి 7గంటల సమయంలో స్వామి సన్నిధిలో అర్చకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వక్సేనారాధన చేసి స్వామి వారి శయనమూర్తికి ప్రత్యేక పల్లకిలో పవళింపు సేవ చేశారు. ప్రధాన అర్చకుడు సాయిరామాచార్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆషాడ శుద్ధ ఏకాదశి మొదలుకుని కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలల పాటు రామచంద్రప్రభువు చాతుర్మాస దీక్ష(యోగ నిద్ర)లో ఉంటారని చెప్పారు. ప్రతి రోజూ స్వామి సన్నిధిలో పవళింపు సేవ జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చోరీల నిందితుడి అరెస్టు


నిందితుడిని మీడియా ముందు హాజరుపరిచి వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేంద్ర

రాజాం సిటీ: చెడువ్యసనాలకు బానిసైన యువకుడు దొంగతనాలకు అలవాటు పడ్డాడు. గతంలో శిక్షలు అనుభవించినప్పటికీ మార్పురాకపోగా మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో రేగిడి మండలం లచ్చన్నవలస, సంతకవిటి మండలం పొనుగుటివలస పంచాయతీ మారుతీనగర్‌లలో చోరీలకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో అందిన ఫిర్యాదుల మేరకు నిఘా వేసిన పోలీసులు నిందితుడిని గురువారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రేగిడి మండలం లచ్చన్నవలస గ్రామానికి చెందిన కామోజుల వెంకటరమణ తన ఇంట్లో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి చొరబడి ఐదు సెల్‌ఫోన్లతో పాటు, రూ.2వేలు నగదు అపహరించాడని ఈ నెల 28న రేగిడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే అదే రోజు సంతకవిటి మండలం పొనుగుటివలస పంచాయతీ మారుతీనగర్‌కు చెందిన బూరాడ చంద్రశేఖర్ తన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారని సంతకవిటిలో ఫిర్యాదు చేశాడు. ఈ రెండు ఘటనలు ఒకేరోజు జరగడంతో పోలీసులు నిఘా పెంచి అనుమానితులను ఆరా తీశారు. ఈ క్రమంలో పాలకొండ పట్టణ పరిధి కస్పావీధికి చెందిన తేగల నానిబాబు గతంలో ఇటువంటి దొంగతనాల్లోనే శిక్ష అనుభవించినట్లు తెలుసుకుని ఆరా తీయగా ఆ రెండు దొంగతనాలను తానే చేశానని అంగీకరించాడు, దీంతో అరెస్టుచేసి ఐదు సెల్‌ఫోన్లు, రూ.2వేలు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నామని సీఐ హెచ్ ఉపేంద్ర తెలిపారు.

ఆహా ఏమి రుచి..!


రామభద్రపురం మార్కెట్‌లో పైనాపిల్ విక్రయిస్తున్న చిరువ్యాపారి

చూడగానే నోరూరించే పండు..పైనాపిల్. అంతరరాష్ట్ర కూడలి రామభద్రపురంలో ప్రతిరోజూ పైనాపిల్ పళ్లతో మార్కెట్ కళ కళలాడుతుంది.ఈ ప్రాంతానికి చెందిన వారే కాకుండా ఇతర రాష్ట్రాలకు వెళ్లేవారు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. చూసిన ప్రతి ఒక్కరికీ కొనుగోలు చేయాలనిపించేలా చిరు వ్యాపారులు వాటిని పేర్చుతున్నారు. ఒక్కో పండు రూ.10 పలుకుతోంది. ఈ పండులో ఆరోగ్యానికి ఉపయోగపడే పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి, కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది. తక్కువ క్యాలరీలు, ఫైబర్ అధికంగా ఉండి జీవక్రియను పెంచుతుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పైనాపిల్ పళ్లను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

- రామభద్రపురం

గురుకులాల్లో ఉత్తీర్ణత శాతం పెంపుదలకు కృషి

- గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్ టి.పద్మజ


మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల కోఆర్డినేటర్ పద్మజ

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు శుక్రవారం నెల్లిమర్లలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా గురుకుల విద్యాలయాల కో ఆర్డినేటర్ టి.పద్మజ తెలిపారు. ఈ మేరకు గురువారం సీతానగరం మండలం జోగింపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాలయానికి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్లకు విద్యార్థులకు కౌన్సెలింగ్ చేయనున్నట్లు చెప్పారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 13 జూనియర్ కాలేజీలున్నాయని వాటిలో నెల్లిమర్ల, వియ్యంపేట, పాలకొండ, భామినిలో ఆర్ట్స్ కోర్సులు, అన్ని కాలేజీల్లో సైన్స్ కోర్సులున్నాయని తెలియజేశారు. ప్రస్తుతం సిబ్బంది ప్రవేశాల పనుల్లో ఉన్నారన్నారు. వివిధ గురుకులాల్లో 6 నుంచి 9 వ తరగతి వరకూ ఖాళీగా ఉన్న సీట్లకు శుక్రవారం ప్రవేశ పరీక్షను ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్ నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ ఏడాది పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో 94 శాతం, ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరంలో 75 శాతం, సెకెండియర్‌లో 77.5 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని అన్నారు. రానున్న పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి అవసరమైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను కోరారు. అందరి సహకారంతో శతశాతం ఉత్తీర్ణ సాధనకు కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జోగింపేట గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఈశ్వర రావు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖినది ఒడ్డున వేంచేసిన వేణుగోలస్వామి ఆలయప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామికి గురువారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకుడు పి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో ఆలయప్రధాన అర్చకుడు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో తీర్థప్రసాదాలు వితరణ గావించారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు


గంట్యాడ మండలంలో విద్యుత్ స్తంభాన్ని ఎత్తుతున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ ప్రమాదాలను నివారించేదిశగా ఆ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. విద్యుత్ స్తంభం పడిపోవడం వల్ల, వైర్లు మీద పడి మనుషులు మరణించారనే అపవాదు రాకుండా ఉండేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు, సహకారాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తోంది. దీంతో ఏళ్ల తరబడి నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. సమస్యలకు తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా విద్యుత్ సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయనే దానిపై విద్యుత్ శాఖ సిబ్బంది సర్వేచేసి గుర్తించి పరిష్కరిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా సర్వే

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎనర్జీ అసిస్టెంట్లు, లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, జేఈలు, ఏడీఏలు వారి పరిధిలో ఉన్న అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఉన్న విద్యుత్ సరఫరా వ్యవస్థపై సర్వే చేశారు.

3790పోల్స్ మార్పు:

గడిచిన ఏడాది కాలంలో డ్యామేజ్ పోల్స్ 3790 మార్చి కొత్త పోల్స్ వేశారు. అలాగే 9884 కిలోమీటర్ల వైర్లు మార్చారు. 33కేవీ లైన్‌కు సంబంధించి 64 ఫీడర్లు ఉన్నాయి. ఈ 64 ఫీడర్లలో ఉన్న సమస్యలను పరిష్కరించారు. 16 వేల ట్రాన్స్‌ఫార్మర్లు మార్పు చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.4 కోట్ల వరకు ఖర్చు చేసింది. పట్టణ ప్రాంతాల్లో అయితే ట్రాన్స్‌ఫార్మర్ 12 గంటల్లోగా, గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల్లోగా మారుస్తున్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ


మరిడిమాంబకు సమర్పించేందుకు 108 ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 108 ఘటాలతో తిరువీధిగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. ఉత్సవంలో భాగంగా నిర్వహించిన పులివేషధారణలు, తప్పెటగుళ్లు, మహిళలకోలాటం, మహిషాసురమర్ధిని తదితర సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. 70 ఏళ్ల తర్వాత జరిగిన పండగలో దూరప్రాంతాల్లో నివసించే గ్రామస్తులందరూ పాల్గొన్నారు. విజయనగరం, విశాఖ, అనకాపల్లి తదితర జిల్లాల భక్తులు తరలివచ్చారు.


వేపాడ: కలశాలలో కోలాటం చేస్తున్న మహిళా కళాకారులు

అక్షరబ్రహ్మ దేవాలయం ప్రారంభం


కారిగూడలో అక్షరబ్రహ్మ దేవాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: కారిగూడలోని అక్షరబ్రహ్మ దేవాలయాన్ని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్షరాలే దైవాలుగా పూజించడం అనాదిగా వస్తుందన్నారు. అక్షరంలోనే ఆదివాసీలు దైవాన్ని చూస్తారన్నారు. లిపికి పూజ చేస్తే సకల దేవతలకు పూజించినట్టేనన్నారు. మంగయ్య గొమాంగో పదేళ్ల పాటు కష్టపడి 1936లో సవరభాషకు లిపి తయారు చేయడం జరిగిందన్నారు. ఆయన కృషి శ్లాఘనీయమన్నారు.